పథకాల అమలులో జాప్యం తగదు

- సమయానికి ప్రజలకు అందాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డితో కలిసి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: పథకాల అమలులో జాప్యం తగదని, సమయానికి ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని కూకట్‌పల్లి, బాలానగర్ ఎమ్మార్వో కార్యాలయంలో 534 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెక్కుల పంపిణీలో జాప్యాన్ని ఎండగట్టినందుకే నేడు చెక్కులు అందజేశారన్నారు. చెక్కులు ఇవ్వకుండా నెల రోజులుగా అధికారులు మంత్రి రాక కోసం నిలిపివేసినా కొంతమంది చెక్కులు వచ్చి వారం రోజులు అవుతుందని తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా అధికారులు చొరవ చూపాలని, రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంక్షేమ పథకాలు అందజేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు మందడి శ్రీనివాసరావు, శిరీష, సబిహా బేగం, జూపల్లి సత్యనారాయణ, రవీందర్ రెడ్డి, సతీష్ గౌడ్, నరసింహ యాదవ్, మాజీ కార్పొరేటర్‌లు బాబూరావు, తూము శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండపాన్ని కూల్చివేసిన హైడ్రా అధికారులు


ఉత్సవాల మండపాన్ని కూల్చి వేస్తున్న అధికారులు

మోతీనగర్: ఉత్సవాల కోసం నిర్మించిన మండపాన్ని హైడ్రా అధికారులు మంగళవారం కూల్చివేశారు. అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్, పర్వత్‌నగర్ మధ్యలో వీఎస్‌ఆర్ నిలయం అపార్ట్‌మెంట్ వారు సుమారు ఐదు సంవత్సరాల క్రితం వివిధ ఉత్సవాల కోసం ఓ మండపాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవాలు పూర్తయిన తర్వాత ఆ మండపాన్ని తొలగించాలని పర్వత్‌నగర్‌కు చెందిన ఇళ్ల గేట్లకు అడ్డంగా ఉన్న నివాసితులు పలుమార్లు అపార్టుమెంట్ వాసులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. మండపం నిర్వాహకులే గేట్లకు అడ్డంగా మండపం వేయటంతో పర్వత్‌నగర్‌కు చెందిన జే.వెంకటేష్, ఇతర వ్యక్తులపై కేసులు సైతం పెట్టారు. వారు కూడా రీపిటిషన్ వేయటంతో 2022 కోర్టు వెంకటేష్‌కు అనుకూలంగా తీర్పిచ్చింది. నాటి నుంచి నేటి వరకు అధికారుల నిర్లక్ష్యం, పట్టణ ప్రణాళిక అధికారుల అలసత్వంతో కోర్టు తీర్పును సైతం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఇటీవల బాధితులు అధికారులను సంప్రదించగా.. వారు కోర్టు ఆర్డర్‌ను అపార్టుమెంట్‌వాసులకు అందజేసి మండపాన్ని మీరే కూల్చి వేయండి లేదా మేము కూల్చివేస్తామని టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు. దీపావళి పండుగ తర్వాత మండపానికి సంబంధించిన పూర్తి సమాచారంతో హైడ్రాకు పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన మండపాన్ని పూర్తిగా హైడ్రా అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య కూల్చివేశారు.

బార్ ఎదుట గొడవ.. చితకబాదిన పోలీసులు



కేపీహెచ్‌బీకాలనీ: మద్యం మత్తులో ఇరువర్గాలకు చెందిన యువకులు బార్ ఎదుట పరస్పరం దాడులు చేసుకున్నారు. సమాచారం అందుకున్న మెట్రో మొబైల్ పోలీసులు వారిని చితకబాదిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన శివ కుమార్ మరో నలుగురు స్నేహితులతో కలిసి హైదర్‌నగర్ వద్ద ఉన్న సిరి బార్‌కు వెళ్లి మద్యం సేవించారు. మియాపూర్ ప్రాంతానికి చెందిన ప్రణవ్ మరి కొందరు స్నేహితులతో కలిసి అదే బార్‌కు వచ్చి మద్యం సేవించారు. రాత్రి 12 గంటల సమయంలో బార్ మూసివేస్తుండటంతో ఇరు వర్గాలు బయటకు వెళ్లే క్రమంలో ఒకరిపై ఒకరు కామెంట్స్ చేసుకొని భౌతికంగా దాడులు చేసుకున్నారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మెట్రో మొబైల్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఇరువురిని తరిమికొట్టేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఇంతియాజ్ అనే యువకుడి వీపుపై చితకబాదారు. మియాపూర్ ప్రాంతానికి చెందిన ప్రణవ్, అతని స్నేహితులు శివకుమార్ సెల్‌ఫోన్ లాక్కొని వెళ్లడంతో పాటు ఫోన్ ఇవ్వకుండా మరుసటి రోజు బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో హైదర్‌నగర్‌కు చెందిన పెద్ద మనుషులను తీసుకొని మంగళవారం ఎమ్మెల్యే కృష్ణారావును కలిసి పోలీసులు కొట్టిన దెబ్బలను చూపించారు. దీంతో విషయాన్ని ఏసీపీ దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. దర్యాప్తు చేస్తున్నామని, ఇరువర్గాలను పిలిచి విచారణ చేపట్టి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీలత తెలిపారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు



జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి,సిటీబ్యూరో: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, రైతులకు వెంటనే డబ్బులు జమ అయ్యేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు. జిల్లాలో 13 సెంటర్ల నుంచి 1012 మంది రైతుల నుంచి 357 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై రైతులకు అందిస్తున్న సౌకర్యాల గురించి ప్రజలకు చేరే విధంగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ ప్రాంతాల నుంచి మంత్రులు పాల్గొన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తోపాటు డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా సివిల్ సప్లై జీఎం సుగుణాబాయి, వివిధ శాఖల జిల్లా అధికారులు విజయకుమారి, చంద్రకళ, నీరజ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే గాంధీ హెచ్చరించారు. మియాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శేరిలింగంపల్లి సర్కిల్, చందానగర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీ, బస్తీలలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పలు డివిజన్‌లలో సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతా లోపంతో 6 నెలల్లోపే దెబ్బతిని గుంతలమయంగా మారుతున్నాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకం పనులు చేసిన కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలాంటి పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం అయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, జీహెచ్‌ఎంసీ అధికారులు ఎస్‌ఈ శంకర్‌నాయక్, ఈఈ ప్రసాద్, డీఈ ఆనంద్, ఏఈ సంతోష్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, ప్రసాద్, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

- భారత రాజ్యాంగ దినోత్సవంలో వక్తలు
- అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలేసి నివాళులర్పించిన వివిధ సంఘాల నాయకులు



హెచ్‌ఏఎల్‌లో నివాళులర్పిస్తున్న హెచ్‌ఏఎల్ డీజీఎం హెచ్.ఆర్. సూర్యకుమార్ రావుట్ తదితరులు


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బహుజన రక్షణ సమితి నాయకులు

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యతని వక్తలు అన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ సంఘాలు, నాయకులు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలేసి నివాళులర్పించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులను వివరించారు. రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞ చేయించారు.

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో విశ్వ విద్యాలయ గ్రంథాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి రాజ్యాంగ పీఠికను చదివారు. ఈ సందర్భంగా నాయకులు రాహుల్ నాయక్, చంద్రశేఖర్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం సర్వ మతాలు, సర్వ కులాలకు సంబంధించిన అతి పవిత్రమైన గ్రంథమన్నారు. కార్యక్రమంలో చందన, సుశృత, అర్జున్ గౌడ్, రోహిత్, కాశీ, గగన్, హరినాథ్, పొల్లిణ, సుజయ్, గణేష్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఏఎల్‌లో...

బాలానగర్: ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని బాలానగర్ హెచ్‌ఏఎల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి హెచ్‌ఏఎల్ డీజీఎం హెచ్.ఆర్. సూర్యకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్ని దేశాల రాజ్యాంగం కన్నా మన రాజ్యాంగం చాలా గొప్పదన్నారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ హెచ్.ఆర్. ప్రహ్లాద్, సత్యనారాయణ, రికగ్నైజ్డ్ యూనియన్ గౌరవ అధ్యక్షులు విజయప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్, గణేష్, కర్క నాగరాజు, కుతాడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయినేని సూర్యప్రకాష్‌రావు, అర్వపల్లి సూర్యరావు, రాజేశ్వరరావు మాట్లాడారు. రాజ్యాంగ పీఠికను చదివి అందరిచే ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సురేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహుజన రక్షణ సమితి ఆధ్వర్యంలో..

ఆల్విన్‌కాలనీ: బాలానగర్ చౌరస్తాలో బహుజన రక్షణ సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో బహుజన రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పాకాల డానియల్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కాశీ సతీష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెట్టిబావి ఆనంద్, గ్రేటర్ హైదరాబాద్ నాయకులు టి. రవీందర్, జి. ప్రభాకర్, విఘ్నేష్, తాటికొండ అశోక్, నాగమణి పాల్గొన్నారు.


జేఎన్‌టీయూహెచ్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు


బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలో పాల్గొన్న నాయకులు

అయ్యప్ప స్వామి మహా పడిపూజ

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని వెంకట పాపయ్య నగర్‌లో మంగళవారం అయ్యప్ప మహా పడిపూజ వైభవంగా జరిగింది. అయ్యప్ప భక్తిగీతాలతో ఆ ప్రాంతం మారుమోగింది. మహా పడిపూజ కార్యక్రమాన్ని కేశవ పంతులు, భజన గంగపుత్ర నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ రంగారావు, ఎర్రబెల్లి సతీష్ రావు, చింతల అక్షిత్ మణికంఠ గురుస్వామి, రాంబాబు, నాగతేజ, రామతేజ, నాగ రాజు, నర్సింగరావు, వెంగళరావు, దామోదర్‌రావు, రంగారావు, రామకృష్ణగౌడ్ పాల్గొన్నారు.

నేడు భగత్‌సింగ్ మేనల్లుడి రాక

సుభాష్‌నగర్: గాజులరామారం విన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం సీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమానికి షహీద్ భగత్‌సింగ్ మేనల్లుడు ప్రొఫెసర్ జగన్మోహన్ సింగ్, కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఆయన భగత్‌సింగ్ సిద్ధాంతాలు, ఆయన దేశానికి చేసిన సేవలపై ప్రసంగించనున్నారన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల నిరసన


కూకట్‌పల్లి అడ్డా వద్ద నిరసనలో పాల్గొన్న నాయకులు

కూకట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సీఐటీయూ నాయకులు అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) కూకట్‌పల్లి అడ్డాలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల నాయకుడు బి. రాములు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్లకు కట్టపెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా మోడీ ప్రభుత్వం కళ్లు తెరిచి కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలన్నారు. కార్యక్రమంలో విజయ్, రవి చంద్రయ్య, శంకర్, రమేష్, సుభాష్, లాజర్, భారతమ్మ పాల్గొన్నారు.

28న 'ఎస్కీ'లో అంతర్జాతీయ సెమినార్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ) ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన అంతర్జాతీయ సెమినార్ జరుగుతుందని 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు తెలిపారు. ఎస్కీ క్యాంపస్‌లోని సెంటినరీ కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 10.30 గంటలకు 'ఇన్నోవేషన్స్ ఇన్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టైనబుల్, డెవలప్‌మెంట్' (ఐఈటీఎస్‌డీ-2024) అనే అంశంపై సెమినార్ ఉంటుందన్నారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా అధ్యక్షుడు డా.జి రంగనాథ్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమ ప్రారంభ సమావేశంలో ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

కాలుష్య కోరల్లో సుభాష్‌నగర్

- యథేచ్ఛగా రసాయనాల లీ సైక్లింగ్ • పట్టించుకోని అధికారులు • దుర్వాసనతో స్థానికుల అవస్థలు


కాలుష్యకారక పరిశ్రమలను అధికారులకు చూపిస్తున్న స్థానికులు


రీసైక్లింగ్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న వ్యర్థాలు

జీడిమెట్ల: అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడతున్నామని సుభాష్‌నగర్ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం కాలనీవాసులు కాలుష్యానికి కారణమవుతున్న పరిశ్రమలను నేరుగా పీసీబీ అధికారులకు చూపించారు. కాలుష్యం కారణంగా ఎదురవుతున్న సమస్యలపై అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. వివరాల్లోకి వెళితే.. సుభాష్‌నగర్ డివిజన్ వెంకటాద్రినగర్‌లోని రెసిడెన్షియల్ జోన్‌లో కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా రీసైక్లింగ్ పేరిట కాలుష్య కారక పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. సదరు పరిశ్రమల నుంచి రసాయనాలు రోడ్లపై పారుతుండటంతో దుర్వాసనలు వెలువడుతున్నాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సోమవారం రాత్రి రోడ్డుపై పారిన ఎర్ర రంగు రసాయనాలతో ఇబ్బందులు పడ్డామని వారు పేర్కొన్నారు. ఈ విషయమై హెచ్‌ఎండబ్ల్యూఎస్, పీసీబీ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు జోక్యం చేసుకుని కాలుష్యానికి కారణమవుతున్న పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నేరుగా డ్రైనేజీలోకి..

వివిధ ప్రాంతాల్లోని పరిశ్రమల నుంచి రసాయన డ్రమ్ములను తీసుకువచ్చి వాటిని ఇక్కడ శుభ్రపరచి నేరుగా రసాయనాలను నాలాల్లోకి వదులుతున్నారు. అసలు వీరికి భూగర్భ డ్రైనేజీకిలోకి నాలా కనెక్షన్ ఎలా వచ్చిందని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అక్రమంగా భూగర్భ డ్రైనేజీలోకి కనెక్షన్ తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పట్టించుకోని పీసీబీ

రసాయనాలు రోడ్లపై పారిన ప్రతిసారి స్థానికుల ఫిర్యాదుతో సంఘటనా స్థలాన్ని సందర్శించే పీసీబీ బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నా. నెల రోజుల క్రితం ఓ రీసైక్లింగ్ యూనిట్ నుంచి రసాయనాలు రోడ్డుపై పారడంతో అక్కడకు వచ్చిన పీసీబీ అధికారులను సదరు యూనిట్ యజమాని విలేకరుల ఎదుటే దుర్భాషలాడినా వారు కిక్కురుమనకుండా అక్కడి నుంచి జారుకున్నారని వారు తెలిపారు.

పీసీబీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తాం

మేము గత కొన్నేళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. రెసిడెన్షియల్ జోన్‌లో జాగా కొనుక్కుని ఇంటిని నిర్మించుకున్నాం కాలనీలో రీసైక్లింగ్ పరిశ్రమల్లోంచి విడుదలయ్యే రసాయనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయం, పీసీబీ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతాం..

– అనిల్ తివారీ
(వెంకటాద్రినగర్ కాలనీ వాసి)

పొంగి పొర్లుతున్న డ్రైనేజీ



మోతీనగర్: కొన్ని రోజుల నుంచి డ్రైనేజీ పొంగి పొర్లడంతో రోడ్డంతా బురద మయంగా తయారైంది. మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీ హాల్ లైన్‌లోని ఓ అపార్టుమెంట్ ముందు డ్రైనేజీ నీరు కొన్ని రోజులుగా పొంగి పొర్లుతోంది. దుర్గంధం, దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులకు స్థానికులు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పొంగుతున్న డ్రైనేజీకి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

హెరాయిన్ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

మూసాపేట: హెరాయిన్‌ను విక్రయిస్తున్న ఇద్దరిని కూకట్‌పల్లి పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. కూకట్‌పల్లిలోని మెట్రో పిల్లర్ 794 వద్ద రాజస్థాన్‌కు చెందిన డొల్ల రాము (23), కమలేష్ (26) హెరాయిన్ అమ్ముతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి అమ్మకందారులు, ముగ్గురు(మనవ్వర్ లాల్ (23), దేవీలాల్ (26), మాగిలాల్ (24) కొనుగోలుదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు కూకట్‌పల్లిలోని స్టీల్ షాపులో పని చేస్తున్నారు. వారి నుంచి 15 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అమ్మకందారులను రిమాండ్‌కు తరలించి, కొనుగోలుదారులకు నోటీసులు ఇచ్చి పంపించారు.

8న 'శాంతిసరోవర్'లో ప్రత్యేక సదస్సు

రాయదుర్గం: శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో డిసెంబర్ 8న ప్రత్యేక సెమినార్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వ్యాపార, వాణిజ్య రంగాలకు చెందిన వారికి 'పర్సనల్ ఎక్సలెన్స్ ఫర్ బిజినెస్ స్ట్రాటజీ అండ్ సక్సెస్' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం ఉంటుంది. అనంతరం మెడిటేషన్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. శాంతిసరోవర్ డైరెక్టర్ బీకె కుల్‌దీప్ దీదీ ఆధ్వర్యంలో సాగే ఈ కార్యక్రమంలో శాంతా బయోటెక్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, ఐసీఏ ఇండియా ఫెలో మెంబర్ రామకృష్ణ చౌదరి, టర్కీ బ్రహ్మకుమారీస్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ట్రైనర్, డైరెక్టర్ యోగేష్ శార్దా, మౌంట్‌అబూ ఆర్ట్ కోఆర్డినేటర్ డేవిడ్ కిలోస్విక్సీ వంటి వారు పాల్గొంటారు. లైవ్ మ్యూజిక్ ఉంటుంది. కార్యక్రమంలో పాల్గొనే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 8087411206లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.


దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

దుండిగల్: తెలంగాణ సాధించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్ అన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఈ నెల 29న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మంగళవారం గండిమైసమ్మలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు వివేకానంద్, మల్లారెడ్డి, మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ ఆంధ్ర పాలకుల హయాంలో అడుగడుగునా వివక్షకు గురైన తెలంగాణ ప్రాంత అభివృద్ధి స్వరాష్ట్ర సాధనతోనే సాధ్యమని నమ్మి 'తెలంగాణ వచ్చుడో... కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసిన దార్శనికుడు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. మలిదశ ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన 2009 నవంబర్ 29 తేదీని గుర్తు చేసుకుంటూ ఏటా దీక్షా దివస్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ప్రభుత్వ మార్పుతో అభివృద్ధి - సంక్షేమ పథకాలు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ ప్రజలను అవస్థల పాలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలను ఎండగట్టేందుకు తెలంగాణ సమాజాన్ని మరోమారు ఏకం చేస్తూ రానున్న రోజుల్లో ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వంతో కొట్లాడే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈనెల 29న ఉదయం ప్రారంభమయ్యే దీక్షా దివాస్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మేయర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్లు పాక్స్ డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం


శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

దుండిగల్: మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లికి చెందిన బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. మేడ్చల్‌లో జరిగిన కార్యక్రమానికి శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎండీ రియాజ్, రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ్రు శోభారాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డిలతో పాటు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని, తనకు పదవి అప్పగించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.



వికారాబాద్ జిల్లా లగచర్ల గ్రామంలో గిరిజనుల సమస్యలను తెలుపుతూ పరిష్కారం దిశగా సహకరించాలని మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుని మంగళవారం జేఎన్‌టీయూహెచ్ బంజారా విద్యార్థి సంఘం అధ్యక్షుడు ధారావత్ వినోద్ నాయక్ కలిసి కోరారు. గిరిజన రైతుల భూములను అన్యాయంగా లాక్కోకుండా సహకరించాలని కోరారు. – కేపీహెచ్‌బీకాలనీ